కదిలిస్తే కన్నీరే..

పొట్ట చేత పట్టుకొని పట్టనానికి వచ్చి.. రాత్రనక పగలనక పనులకు పోయి.. పస్తులతో ఉండి.. పైసా పైసా కూడబెట్టి ఇల్లు కట్టుకున్నారు.. పట్నంలో సొంతిల్లు ఉందని మురిసిపోయారు.. ఆ మురిపెం మూడు నెలలు గడవకముందే ఆవిరి అయిపోయింది. పుట్టెడు దుఃఖంతో, గుండె భారం చేసుకొని కూలిన శిథిలాల కింద సామగ్రిని వెతుక్కుంటూ గూడు కోల్పోయిన వీరి మాటలు వింటుంటే ఎదుటివారి హృదయాలను కలచివేసింది.


సర్వే నం.329లో కూలిన శిథిలాల కింద ఇంటి సామగ్రి, వస్తువులను వెతుకుతున్న మహిళ


సామగ్రిని మోసుకెళ్తున్న మహిళ

సుభాష్‌నగర్: గాజులరామారం డివిజన్ బాలయ్యనగర్, గాలి పోచమ్మబస్తీ, దేవేందర్‌నగర్, కైసర్‌నగర్‌లలోని సర్వే నం.307, 329, 342 ప్రభుత్వ స్థలంలో వెలసిన నిర్మాణాలను శనివారం రెవెన్యూ అధికారులు భారీ పోలీసు భద్రత మధ్య 400 పైగా కూల్చివేశారు. దీంతో ఇళ్లు కోల్పోయిన వారు నిరాశ్రయులయ్యారు. రాత్రి చలిలో వణుక్కుంటూ కూలిన ఇళ్ల వద్దనే ఉండిపోయారు. మరికొందరు దగ్గర్లో ఉన్న బంధువుల వద్ద తలదాచుకున్నరు. బాలయ్య నగర్ లో 45 ఇల్లు కూలగ. బాధితులు ఒక టెంట్ వేసుకొని ఆశ్రయం పొందుతున్నారు.

◆ వస్తు సామగ్రి మట్టిపాలు...

కూల్చివేసే సమయంలో ఇంట్లో వస్తువులు అలాగే ఉండడంతో సామగ్రి శిథిలాల కింద ఉండిపోయింది. ఉదయం ఎక్కడ చూసినా శిథిలాల కింద వస్తువులను వెతుక్కుంటూ వాటిని సేకరించే పనిలో పడ్డారు. తాగడానికి నీరు లేక, స్నానాలకు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు.

◆ పత్తాలేని కబ్జారాయుళ్లు...

కొంతమంది స్వార్థం కోసం అమాయకులు బలి అయ్యారు. ఈ సమస్యకు మూలకారకులైన కబ్జారాయుళ్లు పత్తా లేకుండా పోయారు. దేవుడా ఇక మాకు దిక్కు ఎవరంటూ.. మేము ఎక్కడికి వెళ్లి బతికేది.. ఇక మాకు చావే శరణ్యమని బాధితులు తమ గోడును వెల్లబోసుకుంటున్నారు.

◆ అవకాశం వచ్చినప్పుడు అందరి పేర్లు బయట పెడతా...

ఒక్కో గది నిర్మాణానికి ఏ అధికారికి ఎంత ఇచ్చాను.. ఏ సిబ్బంది ద్వారా పంపాను అనేది త్వరలో బయటపెడతా అంటూ ఓ కబ్జాదారుడు బహిరంగంగా తన ఆవేశాన్ని వెళ్లగక్కాడు. అధికారులకు ప్రతి గదికి డబ్బులు పంపానని తెలిపారు. ఈ నిర్మాణాలకు ఎలాంటి ఇబ్బంది లేదన్నారు. ఇప్పుడు సంవత్సరం కన్నా ముందు కట్టిన గదులను కూల్చివేశారు. ఇదెక్కడి న్యాయం అంటూ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు.


బాలయ్యనగర్‌లో ఇల్లు కూలిపోగా టెంట్ కింద ఆశ్రయం పొందుతున్న మహిళలు

కాయ కష్టం చేసి ఇల్లు కట్టుకున్న...



30 ఏళ్ల నుంచి ఇక్కడే ఉంటున్న. నా భర్త రాళ్లు కొట్టేటప్పుడు ప్రమాదవశాత్తు ప్రమాదం జరిగి చనిపోయాడు. అప్పటి నుంచి స్థానికంగా గుడిసెలు వేసుకొని బతుకుతున్నాం. ఇంటి జాగా కోసం కాళ్లు అరిగేలా సార్ల దగ్గర తిరిగిన ఎవరూ ఏమి సాయం చేయలేరు. నా గుడిసె ఉన్నచోట ఇల్లు కట్టుకున్న. అధికారులు వచ్చి వృద్ధురాలినని చూడకుండా కూల్చివేశారు. సర్కారు మాలాంటి వాళ్లను ఆదుకోవాలి.

– పెంటమ్మ, బాలయ్యనగర్

మాలాంటోళ్లపైనే ప్రతాపం..



ఒకప్పుడు ఇది అటవీ ప్రాంతంగా ఉండే. ఇప్పుడు కొంతమంది వచ్చి ఎకరాల కొద్ది స్థలాన్ని సొంత స్థలంగా పెట్టుకున్నారు. అలాంటి వారిని అధికారులు ఏమంటలేరు. మాలాంటి కాయ కష్టం చేసే వాళ్లు 60 గజాలలో ఇల్లు కట్టుకుంటే జబర్దస్తీ చేస్తున్నారు. మా కూలిన ఇళ్లను సర్కారు అక్కడే కట్టించి మాకు పట్టాలు అందజేయాలి.

– ఉల్లిగమ్మ, ఇల్లు కోల్పోయిన బాధితురాలు

కబ్జారాయుళ్ల పేర్లు చెబితే 'డబుల్'ఇళ్లు ఇస్తాం..



గాజులరామారంలోని 307, 329, 342 ప్రభుత్వ స్థలాల్లో డబ్బులు ఇచ్చి స్థలం కొన్న వారు ధైర్యంగా ముందుకొస్తే వారి పేర్లను గోప్యంగా ఉంచుతాం. అంతేకాకుండా వారికి డబల్ బెడ్ రూమ్ ఇల్లు కల్పిస్తాం. ఎవరైనా కబ్జారాయుళ్ల పేర్లు వచ్చి తనకు నేరుగా ఫిర్యాదు చేయాలన్నారు. దీనికి కారకులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

– అబ్దుల్ రెహమాన్ ఖాన్, కుత్బుల్లాపూర్ తహసీల్దార్

పెళ్లి ఉందని వేడుకున్నా వినలేదు..

నాలుగు రోజుల్లో ఆ ఇంట పెళ్లి, శుభకార్యం కోసం ఇల్లును రంగులతో ముస్తాబు చేశారు. అంతలోనే తెల్లవారు వేకువ జామున అధికారులు వచ్చి ఇల్లు ఖాళీ చేయమన్నారు. నాలుగు రోజుల్లో కూతురు పెళ్లి ఉందని కాళ్లు పట్టుకున్నా వినకుండా కూల్చివేశారు.

◆ ఇప్పుడు పెళ్లి ఎక్కడ చేయాలి? బంధువులు వస్తే ఎక్కడ ఉంటారు అని పెళ్లికూతురు తల్లి ఆవేదన వ్యక్తం చేసింది. బాలయ్యనగర్‌లోని ఇద్దరి సీతారాములు, సంజమ్మ దంపతుల రెండో కూతురు లక్ష్మి పెళ్లి ఈనెల 21న ఉండగా అధికారులు వచ్చి కూల్చోవడంతో లబోదిబోమని రోదిస్తున్నారు. ప్రభుత్వం తమకు సహాయం చేయాలని వేడుకుంటున్నారు.


కూలిన ఇంటి వద్ద తన పెళ్లి శుభలేఖ చూపిస్తున్న పెళ్లికూతురు లక్ష్మి


సర్వే నం.342లో వారం రోజుల క్రితం వెలసిన ఓ కబ్జాదారుడి నిర్మాణాలను కూల్చని అధికారులు

అతడి ఇళ్లను ఎందుకు కూల్చలేదు...

తమ వద్ద సంవత్సరం క్రితం కట్టిన ఇళ్లను అధికారులు కూల్చివేశారు. కైసర్‌నగర్ ప్రధాన రహదారిని అనుకుని హనుమాన్ టెంపుల్‌కి ఎదురుగా సర్వే నంబర్ 342లో వారం రోజుల క్రితమే ఓ వ్యక్తి 30 నిర్మాణాలు కూల్చకపోవడంపై పలువురు కబ్జారాయుళ్లు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు తమవి కూల్చి అతడివి ఎందుకు కూల్చడం లేదని బహిరంగ ప్రశ్నిస్తున్నారు.

మానవతను చాటుకున్న పోలీసులు


ఓల్డేజ్ హోమ్‌లో చేర్పించిన సూరారం పోలీసులు

సుభాష్‌నగర్: ఎవరూ లేని అనాథ వృద్ధురాలిని పోలీసులు వృద్ధాశ్రమంలో చేర్పించి మానవతను చాటుకున్నారు. వివరాల్లోకి వెళితే.. సూరారం మైత్రినగర్‌లోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద గత కొన్ని రోజులుగా మహాలక్ష్మి అనే వృద్ధురాలు ఒంటరిగా ఉంటోంది. కాలనీ కమిటీ సభ్యుడు కృష్ణ ద్వారా విషయం తెలుసుకున్న మనం లైఫ్ సేవర్స్ చారిటబుల్ చైర్మన్ శ్యామ్‌కుమార్ ఆధ్వర్యంలో సూరారం పోలీసులకు సమాచారం అందించారు. దీనిపై స్పందించిన పోలీసులు మహాలక్ష్మిని మియాపూర్‌లోని ఉషాప్రణవ్ ఓల్డ్ ఏజ్ హోమ్‌లో చేర్పించారు.

శుభాకాంక్షలు


మాజీ కార్పొరేటర్ వెంకటేశ్వరరావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ మాజీ కార్పొరేషన్ బొడ్డు వెంకటేశ్వర రావు జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. దుండిగల్‌లో జరిగిన వేడుకలకు ఎమ్మెల్యే వివేకానంద్ హాజరై వెంకటేశ్వరరావుతో కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ, బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని అమ్మిన వారిని శిక్షించాలి

జగద్గిరిగుట్ట: పేదలకు ప్రభుత్వ భూమి అమ్మి మోసం చేసిన భూకబ్జాదారులను కఠినంగా శిక్షించి బాధితులకు న్యాయం చేయాలని ఐఎన్టీయూసీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఐలయ్యగౌడ్ డిమాండ్ చేశారు. ఆదివారం కూల్చివేతలు జరిగిన ప్రాంతాన్ని ఐఎన్‌టీయూసీ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా ఐలయ్య మాట్లాడుతూ... దేవేందర్‌నగర్, కైసరనగర్ ప్రాంతాల్లో పేదల నిర్మించుకున్న ఇళ్లను రెవెన్యూ అధికారులు రాత్రికి రాత్రి కూల్చడం దారుణమన్నారు. పేదలకు తక్కువ ధరలకు ఇళ్ల స్థలాలను విక్రయించి సొమ్ము చేసుకున్న దళారులను వదిలిపెట్టారని అన్నారు. ఈ భూ కుంభకోణంపై సమగ్ర విచారణ జరిపి తెరవెనుక ఉన్న ప్రజాప్రతినిధులు, అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇళ్లు కోల్పోయిన పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను ఇచ్చేలా ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్తామని పేర్కొన్నారు. ఐఎన్‌టీయూసీ నాయకులు దర్పల్లి యాదగిరి, మహేష్, సాయి ప్రవీణ్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

పార్కుల అభివృద్ధికి కృషి చేస్తా


ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న కొలను శ్రీనివాస్‌రెడ్డి

నిజాంపేట్: వాక్ విత్ కేఎస్ఆర్.. మీట్ విత్ కేఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం కాంగ్రెస్ నాయకుడు కొలను శ్రీనివాస్ రెడ్డి నిజాంపేట్‌లోని తులసీరెడ్డికాలనీ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను వివరించారు. ముఖ్యంగా రోడ్లు, వాకింగ్ ట్రాక్‌ను అభివృద్ధి చేయాలన్నారు. వృద్ధులు, మహిళలు కూర్చునేందుకు వీలుగా బెంచ్‌లు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సందర్భంగా కొలను శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. పార్కుల అభివృద్ధికి అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సందర్భంగా స్థానికులు కొలను శ్రీనివాస్‌రెడ్డిని సన్మానించారు.

చదవుతో పాటు అన్ని రంగాల్లో ముందుండాలి


క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

నిజాంపేట్: విద్యార్థులు చదవుతో పాటు అన్ని రంగాల్లో ముందుండాలని నారాయణ స్కూల్స్ ఏజీఎం వైజయంతి అన్నారు. కేపీహెచ్‌బీ జోన్ నారాయణ విద్యా వసంస్థలు ఆధ్వర్యంలో ఆదివారం విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించారు.ఈ పోటీల్లో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం విజేతలైన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సతీష్‌గౌడ్ హాజరు కాగ శ్రీలక్ష్మి, కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం


పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు

కుత్బుల్లాపూర్: కొంపల్లిలోని శివ శివాని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ కళాశాలలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో 11 బ్యాచ్‌లకు చెందిన పూర్వ విద్యార్థులు హాజరు కాగా వారిని ఘనంగా సత్కరించారు. ఈ నేపథ్యంలో వారు తమకు కళాశాలతో గల అనుబంధాన్ని, గత స్మృతులను తలచుకుని ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ డా. రమణారావు మాట్లాడుతూ.. శివ శివాని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో సుమారు 4500 మందికి పైగా విద్యార్థులు పట్టభద్రులై ఎన్నో ఉన్నత పదవుల్లో స్థిర పడ్డారన్నారు. విద్యార్థుల ఉన్నతికి యాజమాన్యం ఎల్లప్పుడు కృషి చేస్తుందని తెలిపారు. ముఖ్య వ్యాఖ్యతగా పాల్గొన్న చీఫ్ స్ట్రాటజిస్ట్ శ్రీనివాస్‌రావు ఇతిహాసాలైన రామాయణ, మహాభారతం కావ్యాల్లో మంచి చెడులపై వివరించారు. విద్యార్థులు నిర్వహించిన సంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

వైభవంగా గ్యార్వీ ఉత్సవాలు


గ్యార్వీ ఉత్సవాల్లో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకుడు జైహింద్

జగద్గిరిగుట్ట: గ్యార్వీ ఉత్సవాలు మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయని బీఆర్ఎస్ నాయకుడు జైహింద్ అన్నారు. ఆదివారం జగద్గిరిగుట్ట డివిజన్ మగ్దూమ్‌నగర్‌లో జరిగిన గ్యార్వీ ఉత్సవాల్లో పాల్గొన్న ఆయన చాదర్ కప్పి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్యార్వీ ఉత్సవ కమిటీ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా అభివృద్ధి చేపడదాం

నిజాంపేట్ కార్పొరేషన్ సమావేశంలో ఎమ్మెల్యే వివేకానంద్


సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే వివేకానంద్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మేయర్ నీలారెడ్డి

కుత్బుల్లాపూర్: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో మేయర్ నీలారెడ్డి అధ్యక్షతన జరిగిన జరిగిన అభివృద్ధి పనుల సమీక్ష కార్యక్రమానికి ఎమ్మెల్యే వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... కుల, మత, ప్రాంత, పార్టీలకు అతీతంగా నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలో అభివృద్ధి పనులు చేపడదామన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు క్షేత్రస్థాయిలో తిరుగుతూ ప్రజలతో మమేకమై పనిచేసినప్పుడే అభివృద్ధి వేగవంతమవుతుందన్నారు.

◆ నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తిచేసి మరిన్ని నూతన పనులు చేపట్టి నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దడంలో ప్రజాప్రతినిధులు, అధికారులు భాగస్వాములు కావాలన్నారు. ఈ సమావేశంలో కమిషనర్ రామకృష్ణారావు, డిప్యూటీ మేయర్ ధనరాజ్‌యాదవ్, కార్పొరేటర్లు, కో–ఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

◆ చింతల్ డివిజన్ వివేకానంద నగర్ షాబుద్దీన్ బస్తీలోని ఆదివారం నిర్వహించిన మహబూబ్–సుభానీ–చిల్లాల్లో నిర్వహించిన గ్యార్వీ ఉత్సవాలకు ఎమ్మెల్యే హాజరై ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎండీ చాంద్ పాషా, ఎండీ అలీ, ఎండీ మస్తాన్ సాబ్, ఎండీ. ఆసిఫ్, ఎండీ. మహబూబ్, నరేష్, చందు, యాదగిరి, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

◆ జీడిమెట్ల డివిజన్ వివేకానందనగర్‌లో గ్లోరీ టు జీసస్ మినిస్ట్రీస్ చర్చిలో నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొని క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్లోరీ టూ జీసస్ మినిస్ట్రీస్ చర్చి పాస్టర్ పసల ఆంటోనీ, సభ్యులు మడుపు శ్యాంసుందర్, మడుపు ప్రశాంతి, పసల జోసెఫ్, డేవిడ్, యోనా, కుమార్, జోసెఫ్, చంద తదితరులు పాల్గొన్నారు.

◆ గాజులరామారం డివిజన్ రావి నారాయణ రెడ్డినగర్ ఈస్ట్‌లో శ్రావణ్ గురుస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన అయ్యప్ప మహా పడిపూజ కార్యక్రమానికి ఎమ్మెల్యే వివేకానంద ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ మహా పడిపూజ కార్యక్రమంలో సోమేష్ గురుస్వామి, మురళీకృష్ణ, నారాయణ, కోటి, సూర్య, లోకేష్, తిరుపతి, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

నిజాంపేట్: ఫ్లైఓవర్ పనుల నిమిత్తం విద్యుత్ సరఫరాలో సోమవారం అంతరాయం ఉంటుందని బాచుపల్లి ఏఈ శాంతకుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. రెయిన్‌బో కాలనీ, ప్రణీత్, జనీత్, బాచుపల్లి సిగ్నల్ నుంచి అంగరా హోటల్ తదితర ప్రాంతాల్లో ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

అపురూపాకాలనీలో...

జీడిమెట్ల: విద్యుత్ మరమ్మతుల కారణంగా సోమవారం అపురూపాకాలనీలో 10గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉన్నట్లు ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు.

ప్రగతినగర్ సబ్‌స్టేషన్ పరిధిలో..

నిజాంపేట్: ఫీడర్ మరమ్మతుల కారణంగా ఈనెల 18న ప్రగతినగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ప్రగతినగర్ ఏఈ సమ్మయ్య ఓ ప్రకటలో తెలిపారు.

◆ డాక్టర్ కాలనీ కెబుల్, ఎలీఫ్ ఫీడర్ల పరిధిలో నిజాంపేట్ మున్సిపల్ కార్యాలయం, శ్రీమంకీస్ సెంటర్, ప్రభుత్వ పాఠశాల బాప్టిస్ట్ చర్చి, 60ఫీట్ల రోడ్డు, అంబేడ్కర్ పార్కు తదితర ప్రాంతాలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

◆ అదే విధంగా ప్రగతినగర్, ఎలీప్ ఎస్ ఎస్ ఫీడర్ల పరిధిలోని ప్రగతి స్కూల్, మధురానగర్ రోడ్డు, అపురూప కాలనీ, డాలర్ హిల్స్ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

కొంపల్లి సెక్షన్ పరిధిలో...

కుత్బుల్లాపూర్: చెట్ల కొమ్మల తొలగింపు, విద్యుత్ ఫీడర్ల నిర్వహణ నేపథ్యంలో సోమవారం కొంపల్లి సెక్షన్ పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ఏఈ ఓ ప్రకటనలో తెలియజేశారు. కార్తీక వనం ఫీడర్ పరిధిలోని దూలపల్లి 120 గజాలు, వీకర్ సెక్షన్‌కాలనీ, అయ్యప్పకాలనీ, గంగాస్థాన్, కార్తీకవనం, ఫారెస్ట్ అకాడమీ, ఐజాంట్ పరిశ్రమ ప్రాంతాల్లో ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5.30గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

నేడు కాంగ్రెస్ పార్టీ సమావేశం

నిజాంపేట్: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం ఈనెల 18న సోమవారం నిర్వహిస్తున్నట్లు కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొలను రాజశేఖర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. బాచుపల్లిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించే ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ కొలను హన్మంత్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు.

ప్రభుత్వ స్థలాలను పరిరక్షిస్తాం

బాచుపల్లి మండల తహసీల్దార్ పూల్‌సింగ్



నిజాంపేట్: బాచుపల్లి మండలంలోని రెవెన్యూ సమస్యలు, కొత్త ఓటరు నమోదు కార్యక్రమం, విద్యార్థులకు సర్టిఫికెట్ల జారీ, పైరవీకారుల జోక్యం, ప్రభుత్వ స్థలాల అక్రమణ తదితర తదితర అంశాలపై బాచుపల్లి మండల తహసీల్దార్ పూల్‌సింగ్‌తో 'సాక్షి'ఇంటర్వ్యూ.

ప్రశ్న: ఓటరు నమోదుకు ఈసీ మరోసారి అవకాశం ఇచ్చింది. ఈ కార్యక్రమం కోసం ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.?

జవాబు: ఎన్నికల కమిషన్ మరోసారి కొత్త ఓటరు నమోదు కోసం అవకాశం ఇచ్చింది. ఇప్పటి వరకు ఓటరుగా నమోదు చేసుకోలేని వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. అనివార్య కారణాల వల్ల గల్లంతైన వారు సైతం తమ పేరు కోసం అప్‌లై చేసుకోవచ్చు.

ప్రశ్న: ఓటరు కోసం ప్రజలు ఎక్కడ దరఖాస్తు చేసుకోవాలి.?

జవాబు: తమ పేర్ల నమోదు కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఆయా డివిజన్లలోని బీఎల్ఓలకు సైతం దరఖాస్తులు ఇవ్వవచ్చు. బాచుపల్లి తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించవచ్చు. ఇంకా ఏమైన అనుమానల నివృత్తి కోసం డిప్యూటీ తహసీల్దార్ ప్రభుదాసు 9963481712 నెంబర్‌కు ఫోన్ చేసి సమాచారం పొందవచ్చు.

ప్రశ్న: ప్రజలు రెవెన్యూ కార్యాలయానికి సంబంధించిన వివిధ సమస్యల పరిష్కారానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రజల అవసరాలను ఆసరగా చేసుకుని పైరావీకారుల జోక్యం ఎక్కువైందనే ఆరోపణలు ఉన్నాయి.? దీనిపై మీ సమాధానం.?

జవాబు: ప్రజలకు రెవెన్యూ కార్యాలయం నుంచి అందాల్సిన సేవాలను నేరుగా మమ్మల్ని సంప్రదించి పరిష్కారించుకోవచ్చు. పైరవీకారులను నమ్మొద్దు. సమయానికి నేను లేక పోయిన డిప్యూటీ తహసీల్దార్ అందుబాటులో ఉంటారు.

ప్రశ్న: విద్యార్థులతో పాటు సర్టిఫికెట్లు అవసరం ఉన్నవారికి సకాలంలో సర్టిఫికెట్లు అందడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.? ఎందుకు జాప్యం జరుగుతోంది.?

జవాబు: సర్టిఫికెట్ల జారీలో ఎలాంటి జాప్యం జరుగదు. మొన్నటి వరకు ఎన్నికల విధుల కారణంగా కొంత ఆలస్యమై ఉండొచ్చు. అయినప్పటికీ సాధ్యమైనంత తొందరగానే జారీ చేస్తున్నాం. ప్రస్తుతం అయితే రెండు మూడు రోజుల్లో సర్టిఫికెట్లు జారీ చేస్తున్నాం. ఎవరికైన ఇంకా అత్యవసరంగా ఏమైన అవసరం ఉంటే తమను సంప్రదించవచ్చు.

ప్రశ్న: బాచుపల్లి మండల పరిధిలో ఉన్న ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు మా సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉన్నారు. ఎక్కడ ఎలాంటి నిర్మాణాలు జరిగినా వెంటనే చర్యలు తీసుకుంటున్నాం. ఇటీవల ఎన్నికల బిజీలో ఉన్న సమయంలో అక్కడక్కడ కొందరు నిర్మాణాలు చేపట్టిన వాటిని ఇప్పటికే కూల్చేశాం. కోర్టు జోక్యం చేసుకున్న వాటి విషయంలో న్యాయపరంగా చర్యలు తీసుకుంటున్నాం.

రహదారులకు మరమ్మతులు చేపట్టండి


ఎల్ఎన్‌బీనగర్ - షాపూర్‌నగర్ రోడ్డు

రంగారెడ్డినగర్: జీహెచ్ఎంసీ పరిధిలోని రోడ్లు మారుమూల గ్రామల రోడ్లను తలపిస్తున్నాయి. ప్రతి ఏటా కోట్లాది నిధులు రోడ్ల మరమ్మతులకు వెచ్చిస్తున్నా పలు చోట్ల ఛిద్రమైన రోడ్లు కనిపిస్తున్నాయి. సూరారం డివిజన్ పరిధి షాపూర్‌నగర్‌లోని ఎస్ఎల్‌బీనగర్‌కు వెళ్లే రోడ్డు పలు చోట్ల దెబ్బతిని రాకపోకలకు తీవ్ర ఆటంకంగా మారింది. షాపూర్‌నగర్ మార్కెట్‌కు వెళ్లే వాహనదారులు ఎక్కువగా ఈ రోడ్డు గుండానే రాకపోకలు సాగిస్తుంటారు. దీంతో ఛిద్రమైన రోడ్డుతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

సత్తాచాటిన విజ్ఞానజ్యోతి స్కూల్ విద్యార్థులు

నిజాంపేట్: హైదరాబాద్‌లోని శ్రీరామ్ యూనివర్సల్ స్కూల్‌లో శనివారం జరిగిన రాష్ట్రస్థాయి ఆవిష్కార్ రోబోటిక్స్ పోటీల్లో వీఆర్ఎస్ విజ్ఞాన జ్యోతి స్కూల్‌కు సంబంధించిన ఆరు జట్లు ఢిల్లీలో జరిగే ఫైనల్‌కు ఎంపిక అయ్యాయి. ఈ రోబోటిక్స్ పోటీలో వివిధ జిల్లాల నుంచి రాష్ట్ర వ్యాప్తంగా పలు స్కూల్స్, జూనియర్ మిడిల్ ,సీనియర్ కేటగిరీలో పాల్గొన్నారు. విజ్ఞాన జ్యోతి స్కూల్ నుంచి 14 జట్లు పోటీల్లో పాల్గొనగా 6 జట్లు ఫైనల్‌కు ఎంపికయ్యాయని స్కూల్ డైరెక్టర్ కోడలి విజయరాణి తెలిపారు. జనవరి 12, 13వ తేదీల్లో జరిగే ఫైనల్ పోటీల్లో విద్యార్థులు పాల్గొననున్నారు. విజయం సాధించిన విద్యార్థులను పాఠశాల డైరెక్టర్, ఉపాధ్యాయులు అభినందించారు.

డ్రైనేజీ లీకేజీ.. మురుగు రోడ్లపైకి!


రంగారెడ్డినగర్‌ను ఆనుకుని రోడ్డుపైకి గాంధీనగర్ పారిశ్రామికవాడ నుంచి పారుతున్న మురుగు

రంగారెడ్డినగర్: పారిశ్రామికవాడల్లో పారిశుద్ధ్య నిర్వహణకు ప్రతిఏటా లక్షలాది నిధులు వెచ్చిస్తున్నా డ్రైనేజీ లైన్ల ఆధునీకరణ మాత్రం చేపట్టడం లేదు. రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని గాంధీనగర్ పారిశ్రామికవాడలో పలు రసాయన, ఇంజినీరింగ్, ప్యాకింగ్ పరిశ్రమలు ఉన్నాయి. ఐలా ఆధ్వర్యంలో సదరు పరిశ్రమల నుంచి తూచా తప్పకుండా పన్నులు వసూలు చేస్తున్నా మౌలిక వసతులను మాత్రం మెరుగు పర్చడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎన్నో ఏళ్లుగా కొనసాగుతున్న పాత డ్రైనేజీ వ్యవస్థను నేటికీ కొనసాగిస్తుండటంతో పలు చోట్ల మురుగు లీకేజీ ఏర్పడి రోడ్లపైకి వస్తున్నాయి. రంగారెడ్డినగర్‌ను ఆనుకుని ఉన్న గాంధీనగర్ పారిశ్రామికవాడ నుంచి డ్రైనేజీ నీరు రోడ్లపైకి వస్తుండటంతో స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.